కథావేదిక

# మాతృత్వం

## - పినాకిని

బాల్కనీలో వాలుకుర్చీలో కూర్చుని ప్రజాహిత పత్రిక తిరగేస్తోంది దివ్య. పేపరు చూసినా, పుస్తకం తీసినా శ్రీరాములు మొదలుకొని చిత్తగించవలెను వరకు చదివి తేనేకాని ఆమెకి చదివిన తృప్తి వుండదు. ఆ బుద్ధి ఆమెకి మొదటినుంచి వున్నదే. ఆ పుస్తకం ఈ పుస్తకం అని లేదు. రామాయణం మొదలుకొని రమణి దాక చదివేస్తుంది. 'నీ పుస్తక పఠనం అయితే, కాస్తకాఫీ పోస్తావా' అనేవారు ఆమె శ్రీవారు. 'ఇదుగో అయిపోయిందండి, కాఫీ ఇచ్చేస్తాను కాస్త ఆగండి' అనేది.

నాలుగైనా కదిలేది కాదు. కాఫీ ఇచ్చేదికాదు. వళ్లుమండి వాళ్లాయన, నీకు పరీక్షలు దగ్గరపడుతున్నాయి, జాగ్రత్తగా చదువు అంటూ వెటకారంగా రుసరుసలాడుతూ బయటకి వెళ్లి ఏ హోటల్లోనో టిఫినుతో కానిచ్చేవారు మేష్టారు.

సాయంత్రం ఆరుగంటలకో ఏడుగంటలకో ఇల్లుచేరిన మేష్టారికి ఆ కుర్చీలోనే, ఆ పుస్తకాలతోనే అక్కడే వుండేది దివ్య. వెర్రిమొద్దు కాఫీ తాగిందో లేదో అనుకునేవారు మేష్టారు. అంత పుస్తకాల పిచ్చి దివ్యకి.

ప్రజాహిత తిరగేస్తుంటే దివ్యకి ఇరవై తొమ్మిదో పేజీలో కనిపించింది ఓ కథ. ఆ కథ ప్రారంభం చూసిన ఆమెకి అది తను రాసిన కథలా అనిపించింది.

'ఏవిటి ఈ కథ నాదిలా వుంది' అనుకుంది. అప్పుడప్పుడు ఆమె పత్రికలకి ఏవేవో కథలు, కాకరకాయలు వ్రాసి పంపడం అలవాటు. ఆ కథ ఏ పత్రికకి పంపిందో, ఏ పేరున పంపిందో కూడా గుర్తులేదు ఆమెకి. ఏ డైరీలోనూ కథ పేరు, కలంపేరు, పంపిన డేటు కూడా రాసుకోదు. 'ఆ, వాళ్లు వేసుకుంటారేవిటిలే' అని వూరుకుంటుంది. ఒక పేరాగ్రాపు కథ చదివేసరికే, ''అయ్యబాబోయి...ఈ కథ నాదేనే బాబు'' అంటూ కొండంత ఆనందంతో కోడలిని పిలిచింది. అత్తగారి కంగారు చూసి కోడలు ఏవిటత్తయ్యా అంటూ వచ్చింది.

''ఈ కథ నాదేనే. మా అబ్బాయి పుట్టక పూర్వం, మా ఇంట్లో అప్పన్న కుటుంబం మాకు చాలా సేవలు చేశారు. వాళ్ల పిల్లలు మా ఇంట్లో తిరుగాడిన తర్వాతనే నేను మాతృత్వం పొందాను. వాళ్ల మంచితనాన్ని, అభిమానాన్ని ఇన్స్పిరేషన్‌గా తీసుకుని నేను రాసిన కథ- ఈ మాతృత్వం!'' అంటూ ఆ పత్రిక కోడలు చేతులో పెట్టింది. ఆమె కోడలు అటు ఇటు తిరగేసి, ఆ కథ చదవడం మొదలెట్టింది.

''కాస్త గట్టిగా చదువు, నాకూ వినపడుతుంది'' అంది అత్తగారు దివ్య.

కోడలు ఆ కథని గట్టిగా చదవడం మొదలుపెట్టింది.

• • •

సూర్యోదయం అవుతుండగానే ఆ బంగ్లాలో ఓ మూల పాక వేసుకున్న అప్పన్న తన పెళ్లాన్ని కొడుతున్నాడు. ఆ గొడవ వినపడుతోంది. ఆ పెళ్లాం లబోదిబోమని ఏడుస్తోంది. నలుగురు పిల్లల తండ్రి, రోజూ ఏదో గొడవపెట్టి పెళ్లాన్ని తంతూ వుంటాడు. అమ్మ మీదకి ఏం వచ్చినా పెళ్లానికే, పిల్లల మీద కోపం వచ్చినా, తన్నులు పెళ్లానికే.

దివ్య వాళ్లు పెద్ద జాగా మధ్యన పెద్ద బంగళా కట్టుకున్నారు. ఓ మూల జాగా చాలావుంది. ఆ జాగాలో పాక వేసుకోటానికి అనుమతిమ్మని అప్పన్న మేష్టారి కాళ్లమీద పడ్డాడు.

''పిల్లలు కలవాణ్ణి బాబయ్యా, ఆ మూలగా, నాలుగు తాటాకులేసుకుని, చిన్న గుడిసేసుకుంటాను. రిక్షా తొక్కిన డబ్బుల్తో పిల్లలనే పోషించనా, అద్దెలే కట్టనా, అమ్మకే కూడెట్టనా, బాబయ్యా. మీరే చెప్పండి. మీరెప్పుడు పొమ్మంటే అప్పుడు పోతానయ్యగారు. ఇంత దొడ్డి వుంది. కాస్త మొక్క మొటికి వేసుకుంటె, మా ఆడది వాటి ఆలనా పాలనా చూసుకుంటుంది. మా అమ్మకి పెద్ద వయస్సయినా, అమ్మగారికి చిన్నపని పెద్దపని చేసిపెడుతుంది. పెద్దోడికి పదేళ్లున్నాయి. తమరు పిలిస్తే పలుకుతాడు. తవరు నాలుగచ్చరం ముక్కలు నేర్పించారంటే ఆడి బ్రతుకు ఆడు బ్రతుకుతాడయ్యగోరు. పేదోణ్ణి. మాలాటోళ్లని తవరిలాటి ప్రభువులు కనికరించాలి బాబయ్యా'' కాళ్లావేళ్లా పడ్డాడు అప్పన్న.

మేష్టారికి జాలేసింది. మేష్టారికి పదహారేళ్లయింది పెళ్లయి. పిల్లాజెల్లా ఎవరు లేరు. సగం జుట్టు కూడా నెరిసింది. ఇంక నాకు పిల్లలేవిటి అనుకున్నాడు. భార్యకి ముప్ఫైఏళ్లు దాటాయి. ఎవరినైనా దగ్గర పెట్టుకుందావన్నా, మేష్టారి అన్నగారి కొడుకున్నాడు, పెళ్లాం వద్దంది. పెళ్లాం తమ్ముడికి ముగ్గురూ ఆడపిల్లలే. మా చెల్లి పిల్లని తెచ్చుకుందావంది దివ్య. ఆడపిల్ల నాకక్కర్లేదే. ఇంటి పేరు నిలబెట్టేవాడు వుండాలి. కాని ఆడపిల్లకి పెళ్లిచేస్తే దానింటికది పోతుందిగాని, నీకూ నాకూ ఏం ఉపయోగపడుతుందే. గట్టిగా నాలుగు మాటలనేసరికి మూతి ముడిచి, మీ అన్న కొడుకుని మాత్రం తెచ్చారంటే, నూతులో దూకుతానంది దివ్య. ఎందుకొచ్చిన బాధ. పెంపు వద్దు, గింపు వద్దని వూరుకున్నారు మేష్టారు.

అప్పన్న దొడ్లో పాక వేసుకోడానికి దివ్య ఒప్పుకోలేదు. ఈ అలగా జనాన్ని తీసుకొచ్చి, నానెత్తికెత్తుతున్నావంది. నాలుగు రోజులు ఎడమొహం పెడమొహం. భార్య మాట వినకుండా అప్పన్న దొడ్లో పాక వేసుకోడానికి మేష్టారు ఒప్పుకున్నారు.

• • •

అప్పన్న పిల్లలు పొద్దున్నే ఏడుస్తోంటే, మేష్టారికి ఒక విధమైన ఆనందంగా వుండేది. పిల్లలు దైవ స్వరూపాలు, కావాలంటే వస్తారా. దేనికేనా పెట్టి పుట్టాలి. నా యోగంలో పిల్లలు లేరేమో అని అప్పుడప్పుడు విచారిస్తూండేవారు మేష్టారు.

నెమ్మదిగా మంచిగా మాట్లాడి కాంతమ్మని పనిలో పెట్టుకుంది దివ్య. ఏవన్నా మిగిలినా తగిలినా పిల్లలకు పెడుతూ వుండేది. అప్పన్న కొడుక్కీ, ఏవో చిన్న చిన్న పన్లు చెబుతుండేది దివ్య.

ఒకరోజు పలక బలపం కొనుక్కొచ్చి ''శీనూ'' అని అప్పన్న కొడుకిని పిలిచాడు మేష్టారు. ''ఏం బాబయ్య'' అన్నాడు.

''ఇదుగో పలక బలపం. రేపటినుంచి రోజూ వచ్చి అక్షరాలు నేర్చుకో. మీ అమ్మగారికి ఆ పని ఈ పని చెయ్యడం కాదు. ఆమె ఖాళీగా వున్నప్పుడు అక్షరాలు నేర్చుకో''

''దివ్యా, మధ్యాహ్నం సమయంలో శీనూకి, వాడి చెల్లెలుకి నాలుగక్షరం ముక్కలు చెప్పచ్చుకదా. వాళ్లా చిన్నవాళ్లు, తెలివైన పిల్లలు. నీకూ కాలక్షేపం'' దివ్యతో చెప్పి వెళ్లారు మేష్టారు.

వారం రోజులనుంచి దివ్యకి జ్వరం. మూసిన కన్ను తెరవటం లేదు. అప్పన్న తల్లి ఒక్కక్షణం దివ్యని విడిచి పెట్టటం లేదు. బాత్‌రూంకి కూడ చెయ్యి పట్టుకుని తీసుకువెడుతోంది. మొహం కూడా మంచం దగ్గరే కడిగించుతోంది. 'అప్పన్న తల్లి అలగావాళ్లని ఇంట్లో పెట్టద్దన్నాను. వాళ్లే ఇప్పుడు దిక్కయారు' మనసులోనే అనుకుంది దివ్య.

''బాబయ్య మంచినీళ్లు కూడా ఇవట్టం లేదయ్యగారు. డాక్టరుగోర్ని పిలిపించండి. తోటకూర కాడలా



వేళ్లాడిపోతున్నారు. రాత్రి లేస్తూనే తూలి తూలి పడత న్నారయ్య. ఓ మంచి డాక్టరికి చూపించడయ్య'' అంది అప్పన్న తల్లి. ఎప్పుడూ జ్వరాలు పడుకోడాలు తెలియదు దివ్యకి.

డాక్టర్ని తీసుకొచ్చారు మేష్టారు.

''ఎన్నిరోజుల నుంచి మీకు జ్వరం'' దివ్యనడిగారు డాక్టర్. ''వారం రోజులనుంచండి'' దివ్య చెప్పింది.

''ఏం పరవాలేదండి, మీరు తల్లి కాబోతున్నారు. అయినా లేడీ డాక్టర్ని కన్సల్ట్ చెయ్యండి'' అని చెప్పి డాక్టరుగారు కొన్ని మందులు వ్రాసిచ్చి వెళ్లిపోయారు. మేష్టారుకి ఆనందంగానూ వుంది.

''ఏమైనా రేపు దివ్యని లేడీ డాక్టరుకి చూపించాలి'' అని మందులు తీసుకుని దివ్య మంచం దగ్గరకొచ్చాడు మేష్టారు. నిజమే ఆ ముసలమ్మ చెప్పినట్టు వాడిన తోట కూర కాడలా వుంది. కళ్లు లోతుకి పోయాయి. బుగ్గలు సొట్టలుపడ్డాయి. పొట్టిగా వున్న, పచ్చగా నిండుగా వున్న మనిషి ఎట్లా అయిపోయిందో అనుకుని, ఆమె పక్కలో కూర్చుని దివ్య చెయ్యి తన చేతుల్లోకి తీసుకున్నారు మేష్టారు.

కొంచెం ముందుకు జరిగింది సిగ్గుపడుతున్నట్టు దివ్య. ''నాతో ఎందుకు చెప్పలేదు. ఇన్నాళ్లకు భగవంతుడు కరుణించాడు. నేను తండ్రిని కాబోతున్నానని, నాకెంత గర్వంగా వుందో తెలుసా దివ్య. మీ అమ్మని పిలిపించనా, నీకు రెస్టుగా వుంటుంది. ఇంటోలో పెద్ద దిక్కు వున్నట్టు వుంటుంది'' అన్నారు మేష్టారు.

''ఇప్పటినుంచి అమ్మ ఎందుకులెండి. నాకేవీ శ్రమ లేదు. కాంతమ్మ అన్నిపన్లు చేస్తోంది. అప్పన్నతల్లి తల్లిలా చూసుకుంటోంది'' అంటూ ఏదో చెప్పాలనుకుంది. ఏవిటి అన్నట్టు చూసారు మేష్టారు.

''అప్పన్న మన దొడ్లో ఇల్లు కట్టుకుని, ప్రవేసించిన వేళ మంచిదండి. ఆ పిల్లలతో నాకు విసుగనిపించింది కాని, వాళ్ల పిల్లల చలవే అనుకోండి, మనకు పిల్లలు కలగడం. అంతా గొడ్డుది గొడ్డుది అంటే, వాళ్ల ముందు ఏడవలేక ఇంటికొచ్చి ఏడిచేదాన్నండి. పైగా, ముప్పై ఏళ్లొచ్చాక ఏం పుడతారని వొకళ్లు, ఎవళ్లనేనా పెంచుకోవచ్చుకదా అని మరొకళ్లు, నా గుండెలు తూట్లు పొడిచేశారనుకోండి'' అని మళ్లీ మేష్టారి వొళ్లో తలపెట్టుకుని గొల్లుమంది.

అప్పన్న పిల్లల మీద ప్రేమ పెరిగింది మేష్టారికి. స్కూల్లో చేరిపించారు వాళ్లని. తలో జత బట్టలు కుట్టించాడు. ఆ పిల్లలు కూడా సారు సారు అంటూ వదిలేవారు కాదు. కాలం మెల్లగా సాగిపోతోంది. దివ్యకి నెలలు నిండాయి. ఇంతవరకు అప్పన్న తల్లి, భార్య అన్నిపన్లు చూసుకునేవారు. అప్పుడప్పుడు అప్పన్న పిల్లలని పక్కన కూర్చోపెట్టుకుని భోజనం చేసేవారు మేష్టారు. వాళ్లతో అరమరిక లేకుండా పోయింది.

దివ్య తల్లిని తీసుకొచ్చారు మేష్టారు. ఈ అప్పన్న పిల్లలు అన్ని ముట్టుకోడం, ఇల్లంతా తిరగడం చూసిన దివ్య తల్లి ప్రభావతికి ఇష్టంలేదు. అస్తమానం ఆ పిల్లలని తిట్టిపోసేది. ''అంటు సొంటు లేకుండగా ఈ సూద్రకూడు నేను తినలేనమ్మా దివ్య. ఎంతలేదన్నా మాంసం తింటున్నావని ఎముకలు మెళ్లో వేసుకుంటారే, ఇల్లాగైతే నావల్లకాదమ్మా'' అని మూడోరోజు బండెక్కేసింది ప్రభావతమ్మ.

మేష్టారికి ఏం చెయ్యడానికి తోచలేదు. కన్నతల్లే నావల్ల కాదని వెళ్లిపోతే ఎవరిని తీసుకురావాలని ఆలోచనలో పడ్డారు మేష్టారు.

''అయ్యగారు'' అంటూ అప్పన్న వచ్చాడు. ''నేనో మాట చెబుతానయ్య, మీరేవి బెంగపెట్టుకోకండయ్యా, మేవు మీ కులం కాకపోయినా, గుణవున్నవాళ్లవే బాబయ్యా. మా అమ్మ తల్లిలా చూసుకుంటుంది అమ్మగార్ని. నా భార్య సరేసరి. అమ్మగారి ప్రసవానికి మేవంతా లేవా బాబయ్యా'' అన్నాడు చేతులు జోడిస్తూ అప్పన్న.

పేదవాడైనా, ఏ బంధుత్వం లేకపోయినా అతనో మంచిమాట అన్నందుకు మాష్టారికి ధైర్యం చిక్కింది. తండ్రి కాబోతున్న ఆనందం ఆయన మోములో తొణికిసలాడింది.

★